స్కూల్ ఫైనల్ పరీక్షలు వ్రాసిన దగ్గర్నుంచీ, అంటే దాదాపు పదహారో ఏడు వచ్చిన దగ్గర్నుంచీ మా వెంకటేశ్వర్లు తన కూతురు జానకికి పెళ్ళి సంబంధాలు చూస్తూనే వచ్చాడు.

జానకి చాలా మంచి పిల్ల. సుమారైన రంగుతో కను ముక్కు తీరుగా ఉండే జానకిని అందగత్తెలలో జమ కట్టవచ్చు. సత్ స్వభావురాలు. స్కూల్ ఫైనల్లో స్కూల్ మొత్తంమీద ఫస్టు రావటాన్నిబట్టి సాటివారికంటే తెలివైనదనే చెప్పవచ్చు.

# ఏనుగులవేట

స్కూల్ ఫైనల్ ప్యాసవగానే జానకి పి. యు. సి.లో చేరి బైలాజికల్ సైన్సెస్ గ్రూపు తీసుకుంది. పెళ్ళి ఎప్పుడు కుదురుతుందో తెలియదు. తాహతు లేనివాడేం కాదు. బాగా ఉన్నవాడే. పెళ్ళి కుదిరినప్పుడు అప్పుడే చదువు మానిపించెయ్యొచ్చులెమ్మని వెంకటేశ్వర్లు ఆలోచన.

ఈ పెళ్ళి విషయాల గురించి జానకి అంతగా పట్టించుకోలేదు. పట్టించుకుంటే ఆ పిల్ల మనసు పెళ్ళి మీదనే పోయి చాలా మంది ఆమె క్లాస్‌మేట్ల లాగే తప్పికూర్చునేది. ఆమె క్లాస్‌మేట్లు చాలామంది బి.యస్సీ ఫస్టియర్లో ఒకటి రెండు పెళ్ళిచూపులలో పాల్గొనటం, పెళ్ళి గురించి ఆలోచిస్తూ వాళ్ళ పరీక్షలు తప్పటం, అక్కడితో చదువు మానేయటం, ఆ తర్వాత రెండు మూడేళ్ళదాకా వారికి పెళ్ళిళ్ళు కాకపోవటం జరిగాయి. వాళ్ళు చదువుకుని ఉంటే పెళ్ళయేసరికి శుభ్రంగా డిగ్రీ చేతిలోకి వచ్చివుండేది.

జానకి పెళ్ళి గురించి బి. యస్సీ ఫైనల్లోకి వచ్చేదాకా గట్టిగా ఆలోచించకపోవటానికి కారణం ఆమె పెరిగిన వాతావరణం. సాధారణంగా మన దేశంలో ఆడపిల్ల అనగానే పుట్టినదగ్గర్నుంచీ చుట్టూ ఉన్న వాళ్ళంతా పెళ్ళి గురించి తప్ప మరో విషయం మాట్లాడరు. అంచేత మన బాలికలకు పెళ్ళయ్యేదాకా పెళ్ళి గురించి తప్ప మరే విషయాన్ని గురించి ఆలోచనలు రావు.

ఈ విషయంలో మాత్రం జానకి మరో రకం వాతావరణలోనే పెరిగింది. మామూలుగా అందరూ చూసే సంబంధాలు అంగీకరించే మనస్తత్వం వెంకటేశ్వర్లులో లేదు. ని స్నే

అదో రకం ఆలోచనలు మామూలు మనుషులు ఎగబడే సంబంధాలన్నీ అతని దృష్టిలో సామాన్యమైన లేక చచ్చు సంబంధాలు. అతని దృష్టి ఎప్పుడూ పై అంతస్తువారిమీదే ఉండేది. తన అంతస్తులోనే ఉన్న ఎంతోమంది మంచి ఆలోచనా శక్తి, కార్యదీక్ష వుండి పైకి వెళ్ళే నేర్పుగల యువకులను అతను గుర్తించలేకపోయాడు. గుర్తించటానికి ఇష్టంలేకపోవటం కూడా అందుకొక కారణం కావచ్చు. అతను ఆలోచించి తనకు పనికిరాని సంబంధాలని నిర్ణయించుకున్న కొందరు యువకులకు తన బంధువులే తమ కూతుళ్ళనిచ్చి పెళ్ళిచేయటమూ, తర్వాత వారు పైకివెళ్ళటమూ జరిగాయి. పైకివెళ్ళటమంటే వెంకటేశ్వర్లు దృష్టిలో దాదాపుగా ఆస్తి సంపాయించటమే గాని నా దృష్టిలో కాదు. తెలివితేటలతో ఆస్తీ, మంచిపేరు కూడా తమంతగానే సంపాయించారు. సుఖంగా. ఆదర్శప్రాయంగా సంసారాలు చేసుకుంటున్నారు. వారికి అప్పుడే ఒకటో అరా సంతానం.

అసలు లోపం ఎక్కడున్నదంటే వెంకటేశ్వర్లు తనకంటే ఒకరు తక్కువ స్థాయిలో ఉన్నారని అనిగనక అనుకుంటే ఇక అతనిలో ఎన్ని గొప్ప గుణాలున్నా వాటిని అంగీకరించలేడు. స్థాయి అంటే వెంకటేశ్వర్లుదృష్టిలో ఆస్తి, హోదా మాత్రమే. వెంకటేశ్వర్లు కంటే తక్కువ ఆదాయమే ఉన్న వెంకట్రామయ్య గారింట్లో వెంకటేశ్వర్లు ఇంట్లోలేని రేడియోగ్రాం, ఎయిర్ కూలర్ ఉన్నాయి. వెంకట్రామయ్యకు జీవితాన్ని అనుభవించటం తెలుసు. ఎప్పుడూ సరదాగా ఉంటాడు. అయినా వెంకటేశ్వర్లు వెంకట్రామయ్యను తన కంటే తక్కువస్థాయివాడిగా పరిగణించటం నేను స్వయంగా ఎరుగుదును. వెంకటేశ్వర్లును గూర్చి ఊళ్ళో మంచి అభిప్రాయం కంటే చెడ్డఅభిప్రాయమే ఎక్కువగా ఉంది. అంతెందుకు. నాకు చుట్టమైనా నాకు అతనంటే సదభిప్రాయం మాత్రం లేదు.

వెంకటేశ్వర్లు కూతురు వినేటప్పుడు తన బంధువులు చూసే ఈ "అడ్డమైన" సంబంధాల గురించీ మాట్లాడకపోడంవల్ల, వాళ్ళమ్మ ఎప్పుడూ ఇంట్లో పెళ్ళి గురించి గొడవ చేసే ముసలివాళ్ళెవరూ లేకపోవటంవల్ల జానకి మరో రకం వాతావరణంలో, అంటే సాధారణ తెలుగుదేశ వాతావరణానికి భిన్నమైన వాతావరణంలో పెరిగిందని చెప్పొచ్చు.

జి. యస్. ఆర్.

## 2

వెంకటేశ్వర్లు జానకికి మొట్టమొదటగా చూసిన సంబంధం రాజశేఖరం మా కుల



స్తుడే. క్రొత్తగా ఐ. ఏ. యస్. పాసై బి.డి.వో.గా మా వూరు వచ్చాడు. చక్కగా అందంగా ఉంటాడు. ఎవరితోనైనా నవ్వుతూ మాట్లాడతాడు. వెనక పెద్ద బాదర బందీ ఉన్నట్లుగా కూడా లేదు. బి. డి. వో తన అల్లుడంటే తనూ తన పలుకుబడి పెంచుకోవచ్చు. అదీ రాజశేఖరాన్ని సెలక్టు చేసుకోవటంలో వెంకటేశ్వర్లు ఉద్దేశ్యం.

వెంకటేశ్వర్లుకూడా మంచి పొజిషన్‌లోనే ఉన్నాడు కాబట్టి రాజశేఖరంతో పరిచయం పెంచుకోవటానికి అట్టే కష్టపడవలసం లేకపోయింది. రాజశేఖరం ఈ పరిచయం మూలంగా వెంకటేశ్వర్లు బలవంతంమీద చాలా సార్లు వెంకటేశ్వర్లు ఇంట్లోనే భోంచేసేవాడు. మామూలుగా అతను ఒక వంటవాడిని పెట్టుకున్నాడు.

ఇక్కడ మా వూరు గురించి మీకు కొద్దిగా చెప్పాలి. మా వూరు చాలా

పెద్దఊరు. ట్రంక్ రోడ్డుమీద, టౌన్‌కు దగ్గర్లో ఉండటంచేత బస్తీ కళలుచాలా వచ్చాయి. రెండు సినిమా హాళ్ళున్నాయి. ఆఖరికి డిటెక్టివ్ పుస్తకాలు అద్దెకిచ్చే షాపులున్నాయికూడా,

బి. ఏ. ఫస్టియర్ చదివి వేసవి శెలవుల్లో ఇంటికి తిరిగి వచ్చాక జానకికి, రాజశేఖరానికీ స్నేహమయింది. రాజశేఖరం చాలా మంచి స్నేహితుడు. జానకికి కావలసిన పుస్తకాలన్నీ లైబ్రరీ నుంచి తెచ్చిపెట్టటమే కాకుండా ఎలాంటి పుస్తకాలు చదవాలో ఎలా పుస్తకాలు చదవాలో సలహా కూడా ఇచ్చేవాడు. ఇద్దరూ కలసి రాజశేఖరం కారులోనే ఎప్పుడన్నా సినిమాలకు కూడా వెళుతుండేవారు. రాజశేఖరం స్నేహంవల్లనే జానకిలో ఆలోచనాత్మకమైన దృష్టికి బీజం పడిందని చెప్పొచ్చు.

రాజశేఖరం గురించిన పూర్తి వివరాలు వెంకటేశ్వర్లు పూర్తిగా సేకరించలేకపోయాడనే చెప్పొచ్చు. రాజశేఖరం మాటల్ని వెంకటేశ్వర్లు చాలా సాదా సూటిగా తీసుకొనక తనకు కావలసిన విధంగా అన్వయించుకొనేవాడు.

ఒకరోజు వెంకటేశ్వర్లు రాజశేఖరంతో "మా జానకి గురించి నీ అభిప్రాయమేమిటోయ్" అని అడిగాడు.

చిరునవ్వుతో సమాధానమిచ్చాడు శేఖరం. "జానకికేం ముందండీ. చాలా తెలివైన పిల్ల. జానకిని చేపట్టేవాడెవడో గాని చాలా అదృష్టవంతుడు."

"జానకికి ఈ సంవత్సరం పెళ్ళి చేద్దామని నా అభిప్రాయం" ఏమంటావన్నట్లుగా చూశాడు వెంకటేశ్వర్లు.

శేఖరం మరేం మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

దీన్ని వెంకటేశ్వర్లు తన కనుకూలంగా ఎలా వ్యాఖ్యానించుకున్నాడో వేరే చెప్పనవసరం లేదనుకుంటాను.


వెంకటేశ్వర్లు సమక్షంలోనే ఒకరోజు జానకి, బహుశా శేఖరానికి పెళ్ళయిందని భావించిందేమో "మీ శ్రీమతిని ఎప్పుడు తీసుకొస్తారండి శేఖరం గారూ" అని అడిగింది.

వినోదంగా చూస్తూ అన్నాడు శేఖరం. "నా భార్య ఇప్పుడు పుట్టింట్లోనే పెరుగుతోందండీ. ప్రస్తుతానికి క్షమించాలి."

అతని సమాధానానికి జానకికి నవ్వు వచ్చింది. "భలే తమాషాగా మాట్లాడతారేమీరు. మరయితే అసలు ఎప్పుడు పెళ్ళి చేసుకుంటారు?" అంది.

"నాకు మాత్రం మరో సంవత్సరం పోయాక చేసుకుందామని ఉందండీ. మా అమ్మ మాత్రం ఈ సంవత్సరమే చేసుకోమని బలవంతం చేస్తున్నదనుకోండి. ముసలి వాళ్ళకెప్పుడూ పెళ్ళి గొడవే కదా" అన్నాడు.

ఇద్దరూ మనసారా నవ్వుకున్నారు.




ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది. ఈ సంభాషణ విని వెంకటేశ్వర్లు చాలా విషయాలు తెలిసినాయనుకుని అమితంగా సంతోషించాడు. త్వరలో అతనితో పెళ్ళి విషయం కదపాలని అనుకున్నాడు. తన ఆలోచనను సూచనప్రాయంగా శేఖరానికి తెలియజేశాడు కూడా. కాని శేఖరం ఎక్కడికో క్యాంప్ కెళ్తా హడావుడిలో ఆ మాటల్ని పట్టించుకున్నట్లు లేదు.

మరో నాలుగైదు రోజుల తర్వాత ఈసారి శేఖర్నిగట్టిగా జానకి పెళ్ళి గురించి అడగాలని అతని ఇంటికి బయలుదేరాడు వెంకటేశ్వర్లు. తన తండ్రి శేఖరంతో తన పెళ్ళి గురించి ప్రయత్నిస్తున్నాడని జానకికి తెలీదు.

దాన్లో ప్యూన్ కన్పించి, క్యాంప్ నుంచి రాగానే శేఖరం వాళ్ళమ్మగారికి సీరియస్‌గా ఉందని టెలిగ్రాం వస్తే ఇంటికి వెళ్ళిపోయాడని చెప్పాడు. ఉసూరుమంటూ వెనుదిరిగాడు వెంకటేశ్వర్లు.

# 3

అలా ఇంటికి వెళ్ళిన శేఖరం మళ్ళా దాదాపు ఇరవై రోజులవరకూ రాలేదు. రాజశేఖరం ఊళ్ళోకి వచ్చి వెంకటేశ్వర్లుగారింటికి వెళ్ళినప్పుడు ఇంట్లో వెంకటేశ్వర్లు లేడు. పొరుగూరెళ్ళాడు. జానకిమాత్రం ఉంది. జానకికి తన పెళ్ళి ఇన్విటేషన్ ఇచ్చాడు రాజశేఖరం.

ఇన్విటేషన్ చూసి ఆశ్చర్యపోయింది జానకి. "ఈ సంవత్సరం పెళ్ళి చేసుకోనన్నారే" అనడిగింది.

చిరునవ్వుతోనే సమాధానమిచ్చాడు శేఖరం. "మా అమ్మకు జబ్బుచేసి చాలా సీరియస్ అయిందండీ. పెద్ద

వయసు కదా. ఇంకెంతోకాలం బ్రతకనని ఆవిడకు గట్టి నమ్మక మేర్పడిపోయింది. పెళ్ళి చేసుకోమని గట్టిగా పట్టుబట్టింది. ఇక తప్పలేదు."

ఒక క్షణం ఆగి మళ్ళా మొదలు పెట్టాడు శేఖరం. "ఇంకో విషయం చెప్పనా, మనిద్దరికీ వివాహం చెయ్యాలని మీ నాన్నగారి ఉద్దేశ్యం. చాలా ఆస్తి ఉంది. పైగా బి.డి.వో గా పని జేస్తున్నాను. ఈ రకంగా అయితే తన ఇన్‌ఫ్లూయన్స్ ఉపయోగించుకోవచ్చుని మీ నాన్నగారు ఆశపడ్డారు. కాని నా గురించి ఆయనకు పూర్తి విషయాలు తెలీవు. స్టేట్ ఇండస్ట్రీస్ మినిష్టర్ గారు లేరూ, ఆయన నా మేనమామ. ఆయన కూతుర్నే నే నిప్పుడు చేసుకోబోతున్నది. ఇన్విటేషన్లలో చూసే ఉంటారు."

జానకి నిస్తేజంగా శేఖరంవంక చూస్తుండిపోయింది. శేఖరం చెప్పుకుపోయాడు.

"మన సంభాషణలు మీ నాన్నగారు మరోరకంగా అర్థం చేసుకున్నారు. మీ రొకసారి నా పెళ్ళి గురించి అడిగితే నా భార్య ఇంకా పుట్టింట్లోనే పెరుగుతున్నదని చెప్పాను గుర్తుందా. అది ఆయన జోక్‌గా తీసుకున్నారు. అది మా మామయ్య కూతురుగురించే చెప్పాను."

కొంచెం నొచ్చుకుంటున్నట్లుగా అన్నది జానకి. "క్షమించండి. మా నాన్న అలా ఆలోచిస్తున్నట్లుగా నాకు తెలీదు."

స్నేహపూర్వకంగా అన్నాడు శేఖరం. "నే నెప్పుడో గ్రహించాను మీ కీ విషయం తెలియదని. ఇక ఆ విషయం పోనివ్వండి. మీరు లోకాన్నర్థం చేసుకోవటానికి ఉపకరిస్తుందని చెప్పాను. నాకు ట్రాన్స్‌ఫరైంది. మా మామయ్యే చేయించాడు మా వూరు దగ్గరలోకి. ఇవ్వాళే వెళ్ళిపోతున్నాను. మీ నాన్నగారు ఊళ్ళో లేరటగా, ఆయన రాగానే చెప్పండి."

"ఇక్కడినుంచి వెళ్ళిపోతున్నారు గదా. ఆఖరుసారిగా భోజనం చేసి వెళ్ళండి" అనడిగింది జానకి.

జానకి కోర్కె ప్రకారం భోజనం చేసి, ఒక పార్కర్ పెన్నును జానకికి ప్రెజెంట్ చేసి వెళ్ళిపోయాడు శేఖరం.

జానకికి మొదటిసారిగా తన తండ్రిపై అసంతృప్తి కలిగింది.

• • •

తర్వాత రాజశేఖరం వివాహానికి గ్రీటింగ్స్ టెలిగ్రామూ, ప్రెజంటేషన్నూ పంపింది జానకి.

# 4

అదివరకు రాజశేఖరం గురించి ఎంతో మంచిగాచెప్పిన వెంకటేశ్వర్లు, తర్వాత అతన్ని గురించి నాతో చెడ్డగా చెప్పి తన స్వభావాన్ని రుజువు చేసు

కున్నాడు. రాజశేఖరం గూర్చి నాకు మొదటినుంచీ మంచి అభిప్రాయమే ఉంది. వెంకటేశ్వర్లు చెడ్డ ప్రచారం ద్వారా అదేమీ తగ్గలేదు.

వెంకటేశ్వర్లు తర్వాత వేటాడిన ఏనుగు రామగోపాలరావు. రామగోపాలరావు జమీందారు కొడుకు. జల్సాపురుషుడు. ఎప్పుడూ విలాసంగా కన్పించేవాడు. మా వూరు వచ్చి ఉప్పుడు బిస్కెట్ ఫ్యాక్టరీ ఒకటి క్రొత్తగా కట్టించడం మొదలుపెట్టాడు.

తన మామూలు పద్ధతి ప్రకారం అతనితో స్నేహం చేసుకున్నాక, ఇంటికి ఆహ్వానించడం మొదలుపెట్టిన తర్వాత, జానకి బి.యస్సీ. రెండవ సంవత్సరం పరీక్షలు వ్రాసి వచ్చిన వేసవి శెలవులలో జానకిని పరిచయం చేశాడు రామగోపాలరావుని.

రాజశేఖరం స్నేహ ప్రభావం, జానకి బి.యస్సీ. రెండవ సంవత్సరం చదువుతూ చదివిన ఇతర లైబ్రరీ పుస్తకాలూ జానకిని ఎలా మార్చేయో వెంకటేశ్వర్లుకి తెలీదు. జానకిలోని మార్పును అతను కలలో కూడా ఊహించలేదు. ఈ మధ్యలో జానకి చాలా ఎదిగింది. చాలా విషయాలపై స్వంత అభిప్రాయాలేర్పరచుకుంది. మనస్తత్వాల్ని పరిశీలించడం నేర్చుకుంది. తన తండ్రి ప్రవర్తనా, ఆశలూ, రామగోపాలరావు ఉద్దేశాలూ చాలా తేలిగ్గా గ్రహించగలిగింది.

ఆ క్షణంనించే రామగోపాలరావుని వీలయినంత దూరంగా ఉంచటానికి ప్రయత్నించింది.

రామగోపాలం జానకితో స్నేహం చేయటానికి చాలా ప్రయాసపడ్డాడు. అసలతను స్త్రీలతో స్నేహం చేయడానికే చాలా ప్రయాసపడతాడేమో! అతను జానకికి చిన్న చిన్న బహుమతులు తీసుకురావటంలాంటి పనులే కాకుండా తన శేలికరకం వ్యక్తిత్వం కన్పించే పనులుకూడా చేశాడు. ఉదాహరణకు తన గురించిన గొప్పలు చెప్పటం, క్రికెట్ గురించీ, కవిత్వం గురించీ జానకికేమీ అసలు తెలియదనే దృష్టిలో తను వినికిడి జ్ఞానంవల్ల మాత్రం గ్రహించిన పైపై విషయాల్ని చెప్పటం మొదలైనవి.

స్కూల్ ఫైనల్ మాత్రం పాసై వారపత్రికా ప్రపంచంలోని పేటి మెంట్లలోను, అర్థంలేని ఆదర్శాలలోను జీవించే నేటి సాధారణ యువతి అతని మాటల్లో పడేదేగాని, జానకి ప్రపంచం అంతకంటే ఉన్నతమైనది. అంచేతే అతని కబుర్లు విని మౌనంగా ఊరుకునేది. వీలయినంతవరకూ అతన్ని తప్పించుకోవటానికే ప్రయత్నించేది.

జానకి స్నేహంకోసం రామగోపాలరావు వెంపర్లాడటం చూసి వెంకటేశ్వర్లు చాలా సంతోషించాడు మనసులోనే. ఒకానొక శుభ ముహూర్తాన జానకితో అతని పెళ్ళి విషయం గురించి చర్చించడానికి చిరునవ్వులు

నవ్వుకుంటూ అతని గదిలోకి అడుగు పెట్టాడు వెంకటేశ్వర్లు. చిరునవ్వులతో వెళ్ళిన వెంకటేశ్వర్లు, ఉక్రోషంతో జుట్టు పీక్కుంటూ ఏడుపు ముఖంతో ఉండేలు దెబ్బతిన్న కాకిలా బయటకొచ్చాడు.

# 5

రామగోపాలరావు రూములో ఏం జరిగిందో అతనే తనకు తెలిసిన వాళ్ళందరికీ పిల్చి సిగరెట్టిచ్చి మరీ చెప్పటంవల్ల ఊరందరికీ తెలిసిపోయింది. అతనే స్వయంగా చెప్పటం వల్ల పూర్తిగా ప్రతి దేలాగూ చాలా మందికి కంఠతా వచ్చేసింది. పైగా అతని గొప్పలు చెప్పుకునే స్వభావం వల్ల జరిగిందానికి మరి నాలుగు కల్పించి చెప్పాడు.

వెంకటేశ్వర్లు రామగోపాలంతో జానకి పెళ్ళి విషయంగురించి మాట్లాడాలనగానే పెద్దగా నవ్వాడు రామగోపాలం. "జానకి పెళ్ళి గురించి నాతో మాట్లాడటమేమిటి" అని.

"అదే జానకిని నీ కిచ్చి పెళ్ళి చేద్దామని" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నాకా" ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు రామగోపాలం. "నా కింత వరకూ పెళ్ళి కాలేదని ఎందు కను కున్నారు ?"

"నీ కిదివరకే పెళ్ళయిందా ?" అనుమానంగా ప్రశ్నించాడు వెంకటేశ్వర్లు.

"అవును. పెళ్ళయి ఏడాది దాటి పోయింది. ఏం ?"

దెబ్బతిన్నట్లుగా దిమ్మరపోయి చూశాడు వెంకటేశ్వర్లు,

"మరి జానకితో అంతగా స్నేహమెందుకు చేసినట్లు ?"

"ఎందుకేమిటి? ఆడపిల్లలతో స్నేహం చేయడమంటే నాకు సరదా."

"హుం! ఆడపిల్లలతో స్నేహంచేసి ఆశలు కల్పించట మెందుకు?"

"ఏ ఏ ఏ కల్పించుకోమన్నారు ఆశలు? అయినా పెద్దలు మీకామాత్రం జ్ఞానం ఉండనక్కరలా. అసలు మీ అంతస్థేమిటి, నా అంతస్థేమిటి ? ఏ ఉద్దేశంతో మీరు నామీద ఆశలు పెట్టుకున్నారు. మీ అమ్మాయిని ఎరగా వాడి జమీందార్లను వలలో వేసుకోవట మేనా మీ ఆలోచనా, ఆశా? అయినా నాకు మీ అమ్మాయినే చేసుకోవలసిన అవసరమేమిటో ఎప్పుడన్నా ఆలోచించారా. మీ అజ్ఞానానికి నన్నేం చెయ్యమంటారు ?"

వెంకటేశ్వర్లు మరేం మాటాడక, బహుశా మాటాడలేక తిరిగొచ్చాడు మొహం కందగడ్డ చేసుకుని.

ఈ రకంగా వెంకటేశ్వర్లు ఈ పేకాట వేటాడటంలో ఎదురుదెబ్బ తిన్నాడు పాపం మొదటి పేకాట చాలా మంచిది. దెబ్బ కొట్టకుండానే వది

లేసింది. ఈ ఏనుగుమాత్రం దిమ్మ దిరిగేలా దెబ్బకొట్టి మరీ వదిలింది. అయినా వెంకటేశ్వర్లుకి శాస్తి కావలసిందే. మరి అతనీ ఏనుగును వేటాడి పట్టగలిగితే తనంత తెలివైనవాడు లేడని ముసుసుకుని ఆకాశాని కెక్కేవాడే గదా !

# 6

జానకి బి. యస్సీ. ఫైనల్ చదువు పూర్తి జేసింది. వెంకటేశ్వర్లింకా ఏనుగున్ని వేటాడుతోనే ఉన్నాడు.

జానకి ఫైనల్ పరీక్షలు వ్రాసి ఇంటికి వచ్చిన వారం పదిరోజులకు వెంకటేశ్వర్లు మేనల్లుడు సత్యనారాయణ వచ్చాడు. (సత్యనారాయణ వెంకటేశ్వర్లుకు స్వయానా మేనల్లుడు కాదు. అల్లుడి వరస) సత్యనారాయణ తల్లిదండ్రులు బీదవారవటంతో వెంకటేశ్వర్లు వాళ్ళతో మొదటినుంచీ అంతగా రాకపోకలు జరపటానికి ఇష్టపడలేదు,

సరిగ్గా సత్యనారాయణ వచ్చే సమయానికే వెంకటేశ్వర్లు జానకితో ఆమె పెళ్ళిగురించి ప్రస్తావిస్తున్నాడు.

"ఈ సంవత్సరం నీ పెళ్ళి చేద్దామనుకుంటున్నానమ్మా" అన్నాడు.

జానకి తలెత్తి చూసింది. ఆ పిల్ల కళ్ళలో వెంకటేశ్వర్లుకు ఏ భావమూ కన్పించలేదు.

ఒక సంబంధం చూశాను. మంచి లక్షాధికారుల సంబంధం. మనకంటే చాలా పై అంతస్థులో వాళ్ళు. కుర్రాడి నాన్నకూ నాకూ ఉన్న స్నేహాన్నిబట్టి ఒప్పుకున్నారు. రెండుమూడు రోజుల్లో నిన్ను చూసుకోవటానికి వస్తారు."

సరిగ్గా ఆ సమయంలోనే సత్యనారాయణ రిక్షా దిగి ఇంట్లో అడుగు బెట్టాడు. అతన్ని చూడగానే ఉద్యోగం చూపి చమని అడగటానికే వచ్చాడని నిర్ణయించుకుని వెంకటేశ్వర్లు మనసులోనే చిరాకుపడి మొహం చిట్లించాడు.

సత్యనారాయణను చూడగానే జానకి మొహం విప్పారింది. "నాన్నా, నేనూ వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాం నాన్నా" అంది జానకి.

వెంకటేశ్వర్లు దిగ్భ్రాంతిచెందాడు. జానకేనా తన కడుపున బుట్టిన తన కూతురేనా "వీణ్ణి, తమకంటే తక్కువ అంతస్థులో ఉన్నవాణ్ణి" చేసుకుంటానంటున్నదీ అని. నిజమే మరి. సత్యనారాయణ అ దిదృష్టిలో ఏనుగుకాదు. కనీసం దోమకంటే గూడా చిన్న.

"మీరిద్దరూనా" తన చెవులను తను నమ్మలేనట్లుగా ప్రశ్నించాడు. అసలు సరిగ్గా ఈ సమయానికే వీ డెక్కడ ఊడిపడ్డాడూ, ఇంతకుముందు వీరిద్దరూ ఎప్పుడు కలుసుకున్నారు, ఏం జేశారూ అని దీర్ఘంగా ఆలోచిస్తూ.

"అవును మామయ్యా" సత్యనారా




యణ నోరు విప్పాడు. "రిజిస్టర్ మ్యారేజీకి అప్లికేషన్ పెట్టి వచ్చాం. మంత్రాల పెళ్ళి అయితే వృధాగా డబ్బు నాశనమవుతుందని. మా అమ్మా, నాన్నా మీకోసం ఎదురు చూస్తున్నారు. మిమ్మల్నందర్నీ తీసుకెళదామని వచ్చాం. రేపు సాయంకాలం బయలు దేరదామా" అన్నాడు గుక్క తిప్పుకోకుండా.

"జానకీ నీతో పెళ్ళి, వీల్లేదు. ఈ పెళ్ళి ఎంతమాత్రం జరగటానికి వీల్లేదు. ఎలా జరుగుతుందో నేను చూస్తాను" అసహనంగా అరిచాడు వెంకటేశ్వర్లు.

ఆ రోజంతా వెంకటేశ్వర్లు చేసిన గొడవ ఊహించుకోవలసిందే.

* * *

మరుసటిరోజున జానకీ, సత్యనారాయణా బయలుదేరారు. వెంకటేశ్వర్లు అఖండసారిగా రంకెలు బెట్టాడు.

"నా కసలు కూతురే లేదనుకుంటాను. నా ఆస్తంతా ఏ మఠానికో రాసి పారేస్తాను. ఫో, నా ఇంట్లోకి మళ్ళా అడుగుబెట్టకు. ఇక జన్మలో నీ ముఖం చూడను" అని రంకెలేశాడు. ఏమన్నా పేచీ పెడదామంటే జానకిక్కి మైనార్టీ దాటిపోయి.

జానకి కట్టుబట్టలతోనే ఇంట్లోంచి బయటకు వచ్చేసింది. తల్లి ఏడుపును గూడా లెక్కచెయ్యకుండా. తల్లి బ్రతిమాలినా కూడా వినకుండా నగలన్నీ ఇంట్లోనే వదిలేసింది.

వెళ్ళబోయే ముందు వాళ్ళిద్దరూ మా యింటికి వచ్చారు. సత్యనారాయణ యమ్మెస్సీ పాసై ఆ సంవత్సరమే జానకి వాళ్ళ కాలేజీలో లెక్చరర్‌గా వచ్చాడుట. జానకి అతన్ని గుర్తించలేదు గాని అతనే మొదట జానకిని గుర్తించి మాటాడాడట. వారిద్దరి స్నేహమూ అలా ప్రారంభమై ఇప్పుడీ వివాహానికి దారితీసింది.

వెళ్ళ పెళ్ళికి నన్ను పిలవకుండా రమ్మని మరీ మరీ అడిగి వస్తానని ఒప్పుకున్న మీదటనే వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. వెంకటేశ్వర్లు తెచ్చే సంబంధాలకోసం ఎదురు చూడకుండా జానకి తనంతట తనే స్వయంగా వరుణ్ణి ఎన్నుకున్నందుకు నాకు చాలా సంతోషం వేసింది. సత్యనారాయణకు మాత్రం తక్కువ. అతను నాకు చాలా ఉత్తముడుగా, సంస్కారవంతుడుగా కన్పించాడు. జానకి వెళ్ళిపోతూ అన్న మాటలు నా కింకా గుర్తున్నాయి.

"సత్యనారాయణను నేను యీ సంవత్సరమంతా పరిశీలించి బాగా అర్థం చేసుకున్నాను బాబాయ్! నా ఉద్దేశాలను, ఆలోచనలను అతను గౌరవిస్తాడు. నా జీవితంలో నాకేంకావాలో నాకు బాగా తెలుసు. మాకు డబ్బు లేకపోయినా ఇద్దరం ఉద్యోగాలు చేసుకుంటూ జీవించగలం గదా ఒకరిమీద ఆధారపడకుండా. జీవితంలో సహచరుడిగా, స్నేహితుడిగా ఉండే భర్త నాకు కావాలి గాని డబ్బుతో నన్ను కొనేసే భర్తా, నన్ను బొమ్మలా ఆరాధించే భర్తా నా కక్కరలేదు. మనిషికి జీవితంలో కావాల్సింది డబ్బే కాదు. డబ్బుకంటే కూడా ముఖ్యమయినవి చాలా ఉన్నాయి."

వెంకటేశ్వర్లు వయసులో సగం వయసు లేకపోయినా ఈ సత్యాన్నే, వెంకటేశ్వర్లు గ్రహించలేని సత్యాన్ని

జానకి గుర్తించినందుకు నాకు చాలా సంతోషం వేసింది.

"వాడా నాకు అల్లుడు ఆ బోడి పంతులా నాకు అల్లుడు. అది నా కూతురే కాదసలు. నా కసలు కూతురే పుట్టలేదు" అని అరిచాట్ట వెంకటేశ్వర్లు పెళ్ళాంమీద. పెళ్ళికి వెళదామని ఆవిడ కంటనీరు పెట్టుకుంటే. పెళ్ళికి నేనూ, నా భార్య వెళ్ళాము. రాజశేఖరం కూడా వచ్చాడు. పెళ్ళి సింపుల్‌గా, బాగా జరిగింది.

పెళ్ళి కాగానే వాళ్ళిద్దర్నీ నేను మా యింటికి తీసుకువచ్చి బట్టలు పెట్టాను. (ఈ విధంగా వెంకటేశ్వర్లుమీద నాకున్న "కసి"ని తీర్చుకున్నాను.) వాళ్ళిద్దర్నీ ఇంట్లోకి రానివ్వకుండా తలుపు లేసుకున్నాడు వెంకటేశ్వర్లు. వెంకటేశ్వర్లు స్వభావం తెలిసిన వాళ్ళెవ్వరూ చిన్నబుచ్చుకోకుండా తిరిగొచ్చారు. వాళ్ళను తీసుకొచ్చినందుకు నా మీద కారాలూ మిరియాలూ నూరాడుగాని నేనేం మాటాడలేదు.

జానకి అమ్మ మాత్రం వెంకటేశ్వర్లుకు తెలియకుండా మా యింటికొచ్చి, కూతుర్నీ అల్లుడినీ పలకరించింది. తాను భర్తకు తెలియకుండా దాచుకున్న డబ్బు అయిదువందలు ఏదన్నా చిన్న నగ చేయించుకోమని జానకిక్కి ఇచ్చింది. జానకి తీసుకోనటానికి ఒప్పుకోలేదు. వాళ్ళమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకునేసరికి, నేను నచ్చచెప్పాక తీసుకుంది. ఈ పెళ్ళి మొత్తంమీద వాళ్ళమ్మకు ఇష్టంగానే వుంది.

జానకిక్కి మొన్ననే కొడుకు పుట్టాడు. ఎర్రగా, బొద్దుగా వున్నాడు. వెంకటేశ్వర్లు పొరుగూరు వెళ్ళిన సమయంలో నేను జానకి తల్లిని తీసుకుని జానకి దగ్గరకు బయిలుదేరాను. మేము రిక్షా దిగబోతున్నప్పుడే వెంకటేశ్వర్లు దొంగలాగా జానకి ఇంటి గుమ్మందిగి వెళ్ళిపోతూ కన్పించాడు! అతను మమ్మల్ని గమనించలేదు.

ఎలాగయినా వెంకటేశ్వర్లుగారు సత్యసంధులు. ఆయన జానకినీ, సత్యనారాయణనీ పలకరించకుండా (వాళ్ళు ఎదురుగానే ఉండటం మూలాన వాళ్ళ మొహాలు మాత్రం చూడక తప్పలేదనుకుంటాను) మనవణ్ణి మాత్రం ఎత్తుకుని ముద్దాడి బంగారుమురుగులు చేతులకు పెట్టి వెళ్ళాడుట.

ఈ మధ్య వెంకటేశ్వర్లుకు జానకి వాళ్ళు ఉంటున్న టౌన్లో పని ఎక్కువగా ఉంటున్నై. కనీసం నెలకోసారన్నా నరస తప్పకుండా వెళ్ళొస్తున్నాడు!

* * *